## క్లుప్తంగా

### కేఎంసీలో ఎంపీ పర్యటన



పనుల వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవకుమార్

**కర్నూలు(హాస్పిటల్):** కర్నూలు మెడికల్ కాలేజీలో మంగళవారం ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవకుమార్ పర్యటించారు. నూతనంగా నిర్మిస్తున్న లెక్చరర్ గ్యాలరీ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంబీబీఎస్ విద్యార్థుల తరగతి గదిలో కాసేపు కూర్చొని లెక్చర్‌ను పరిశీలించారు. లెక్చరర్ హాల్స్, అందులోని వసతులు, సౌకర్యాలను తనిఖీ చేశారు. కళాశాలలోని అన్ని విభాగాల్లో విద్యాబోధనకు అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్ ఉన్నారు.

### ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య

**కర్నూలు(హాస్పిటల్):** గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే స్టాఫ్‌నర్సులు వారి వద్దకు అత్యవసర చికిత్స కోసం వచ్చే రోగుల ప్రాణాపాయస్థితి నుంచి కాపాడాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య సూచించారు. ప్రాంతీయ శిక్షణా కేంద్రం(ఫిమేల్)లో జరుగుతున్న స్టాఫ్‌నర్సుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. పాముకాటుకు, విషం తాగిన వారికి వెంటనే ప్రథమ చికిత్స చేసి, 108 వాహనంలో ఆసుపత్రికి తరలించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడాలన్నారు. కార్యక్రమంలో డీఎంఎంయూ డాక్టర్ ఉమా, డీపీఓ విజయరాజు, డాక్టర్ మారుతీప్రసాద్, డాక్టర్ రజని, డాక్టర్ సుస్మిత, డాక్టర్ చంద్రకాంత్ పాల్గొన్నారు.

### నేడు సబ్సిడీపై టమాట పంపిణీ

**కర్నూలు(అగ్రికల్చర్):** నగరంలోని రైతుబజార్లలో బుధవారం సబ్సిడీపై టమాట పంపిణీ చేయనున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతుబజార్లలో కిలో టమాట ధర రూ.104, బయట ప్రాంతంలో రూ.120 వరకు విక్రయిస్తున్నారన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కిలో రూ.50 లకు అందజేస్తుందన్నారు. ఆధారు కార్డు జిరాక్స్ కాపీ ఇచ్చి కిలో టమాటాలను తీసుకెళ్లాలన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**కర్నూలు కల్చరల్:** స్థానిక బి.క్యాంప్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా విధులు నిర్వహించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈఈటీ, ఓఏ గ్రూప్‌ల్లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉందన్నారు. ఈఈటీ గ్రూప్ పోస్టుకు బీటెక్ (ఈసీఈ)లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఓఏ పోస్టుకు ఎంకామ్‌తో పాటు ఇంగ్లీష్ టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ హయ్యర్ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో ఈనెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

### బెంగళూరుకు వెళ్లి పెన్షన్ అందజేత



పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ బి.రమేష్

**కర్నూలు (సెంట్రల్):** కూతురు కాన్పు కోసం బెంగళూరుకు వెళ్లిన ఓ వృద్ధురాలికి వలంటీర్ అక్కడికే వెళ్లి పెన్షన అందజేశారు. నగరంలోని 93వ వార్డు సచివాలయంలో బి.రమేష్ వలంటీర్‌గా పనిచేస్తున్నారు. ఆయన పరిధిలో ఉన్న వృద్ధురాలు ఈ.శకుంతల ఒకటో తేదీన పింఛన్ ఇచ్చేందుకు వెళ్లగా ఇంటి వద్ద లేకపోవడంతో విచారించాడు. కూతురి కాన్పు కోసం బెంగళూరు వెళ్లినట్లు తెలుసుకుని మంగళవారం అక్కడికే వెళ్లి పెన్షన్ అందజేయడంతో వృద్ధురాలు కృతజ్ఞతలు తెలిపింది.

### ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**కర్నూలు కల్చరల్:** ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం సూచించారు. మంగళవారం ఏక్యాంప్‌లోని మైపర్ ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ అవేర్నెస్ ప్రోగ్రామ్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో నిబంధనలు పాటించి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ జె.రవికుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.సురేష్ పాల్గొన్నారు.

# ఉచితంగా.. వేగంగా!

- జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాల పంపిణీ
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

**కర్నూలు (టౌన్):** సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం నెరవేరుతోంది. ప్రజలకు కావాల్సిన ధ్రువపత్రాలు ఉచితంగా, వేగంగా అందుతున్నాయి. రోజుల తరబడి వేచి చూస్తే కానీ చేతికందని ధ్రువపత్రాలు దరఖాస్తు చేసుకున్న గంటల వ్యవధిలోనే అదికూడా పైసా ఖర్చు లేకుండా జగనన్న సురక్షా కార్యక్రమంలో భాగంగా అధికారులు అందజేస్తున్నారు. ఈనెల 1 నుంచి ప్రతి సచివాలయం పరిధిలో ప్రభుత్వం జగనన్న సురక్షా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి ఏవైనా ఇబ్బందులు తలెత్తినా, మంజూరులో జాప్యం జరిగినా, మంజూరు కాకున్నా వాస్తవ పరిస్థితులు తెలుసుకుని అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. అలాగే విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో సర్టిఫికెట్ల ఆవశ్యకత నెలకొంది. గతంలో తల్లిదండ్రులు కార్యాలయాల చుట్టూ తిరిగే వారు. నిర్ణీత సమయంలో కాకుండా రోజుల తరబడి సర్టిఫికెట్ల కోసం వేచి చేసే వారు. అధికారులు దొరక్క, కింది స్థాయి సిబ్బంది లేక డబ్బు వృథా కావడంతో పాటు పనులు జరగని పరిస్థితి. అయితే ఇప్పుడు పరిస్థితి మారింది. జగనన్న సురక్షా కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వస్తున్నాయా... రావడం లేదా.. అంటూ సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరుగుతున్నారు. ఇక సర్టిఫికెట్లు దరఖాస్తు చేసుకున్న గంటల వ్యవధిలోనే మంజూరు చేస్తున్నారు.

### ఒక్కరోజులోనే మరణ ధ్రువీకరణ పత్రం మంజూరు



ఫొటోలో కనిపిస్తున్న ఆయన పేరు అయ్యన్న. నగర పాలక సంస్థ పరిధిలోని 99వ సచివాలయం మునగాలపాడు నివసిస్తున్నాడు. ఇటీవల ఆయన తండ్రి చిన్న నాగన్న అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందాడు. మరణ ధ్రువీకరణ పత్రం కోసం జగనన్న సురక్షా కార్యక్రమంలో అర్జీ ఇచ్చారు. ఆసుపత్రి నుంచి వివరాలు సేకరించి నిర్ధారించుకున్న గంటల వ్యవధిలోనే మరణ ధ్రువీకరణ పత్రం మంజూరైంది. మంగళవారం ఆయన స్పెషల్ ఆఫీసర్ మున్సూర్ బాషా చేతుల మీదుగా మరణ ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగినా ఇవ్వని మరణ ధ్రువీకరణ పత్రం ఉచితంగా ఇవ్వడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

### సులువుగా కుల ధ్రువీకరణ పత్రాలు



ఈమె పేరు చాకలి రేణుక. 7వ తరగతి చదివే తన కుమారుడికి కుల ధ్రువీకరణ పత్రం అవసరమైంది. సచివాలయ సిబ్బంది ఇంటింటి సర్వేలో భాగంగా మునగాలపాడులోని ఇంటికి వచ్చారు. వివరాలు ఇచ్చింది. మధ్యాహ్నం లోపు మెసేజ్ రావడంతో సచివాలయానికి వెళ్లి నగర పాలక స్పెషల్ ఆఫీసర్ మన్సూర్‌బాషా, టౌన్‌ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటలక్ష్మి చేతుల మీదుగా కులధ్రువీకరణ పత్రం అందుకుంది. కార్యాలయాల చుట్టూ తిరిగితే కానీ సర్టిఫికెట్ రాని పరిస్థితి ఉండేది. ఇప్పుడు స్వల్ప వ్యవధిలో పనులు పూర్తవడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా డబ్బు ఖర్చు కాకుండా ఇంటి వద్దనే ఉచితంగా తమకు కావాల్సిన సర్టిఫికెట్లు సులువుగా మంజూరు అవుతుండటంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### ఆలయాల ఆస్తుల పరిరక్షణకు చర్యలు

**కర్నూలు కల్చరల్:** దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల భూములు, స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఏసీలు, ఈఓలను ఆదేశించారు. మంగళవారం వీరు అమరావతి నుంచి అన్ని జిల్లాల దేవదాయశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. దేవాలయాల భూములు, ఆస్తులు, ఆభరణాలను అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ప్రాపర్టీ రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించేలన్నారు. భూములకు వేలం నిర్వహించడంతో పాటు లీజ్ రుసుం సక్రమంగా వసూలు చేయాలన్నారు. జిల్లా నుంచి దేవదాయశాఖ సహాయ కమిషనర్ రామాంజనేయులు, కర్నూలు, ఆదోని ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, ఈఓలు సీతారామిరెడ్డి, గుర్రెడ్డి, హనుమంతరావు చౌదరి పాల్గొన్నారు.

### నేడు ఆర్‌ఓల సమావేశం

**కర్నూలు(సెంట్రల్):** ఈనెల 21 నుంచి ప్రారంభమయ్యే ఓటరు సవరణ కార్యక్రమంపై బుధవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో రిటర్నింగ్ ఆఫీసర్ల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కలెక్టర్, జేసీలతోపాటు ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది హాజరుకానున్నట్లు తెలిపారు.

# అల్లూరిని స్ఫూర్తిగా తీసుకోవాలి

**కర్నూలు (టౌన్):** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును స్ఫూర్తిగా తీసుకొని సమాజ సేవ చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. మంగళవారం నగరపాలక కౌన్సిల్ హాలులో అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కమిషనర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగరపాలక ఎస్ఈ వేణుగోపాల్, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హాయత్, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

**కర్నూలు(రాజ్‌విహార్):** స్థానిక బిర్లా కాంపౌండ్ వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, పార్టీ నగర అధ్యక్షురాలు సిత్ర సత్యనారాయణమ్మ, దేవపూజ ధనుంజయ ఆచారి తదితరులు పాల్గొని అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు.

**కర్నూలు కల్చరల్:** జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో అల్లూరు చిత్రపటానికి గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, కార్యదర్శి ప్రకాష్ తదితరులు పూలమాలలు, వేసి నివాళులర్పించారు.



అల్లూరి చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ, ఉద్యోగులు

**కర్నూలు (రూరల్):** అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై పోరాడదామని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ అన్నారు. సుందరయ్య భవనంలో అల్లూరి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన అల్లూరి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శిరీష, నగర కార్యదర్శి హుసేన్, మహేష్, గురుసాయి, అబ్దుల్లా పాల్గొన్నారు.

## న్యాయవాదుల నిరసన

**కర్నూలు(లీగల్):** భారత న్యాయవాదుల సంఘం(ఐఏఎల్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కర్నూలు బార్ అసోసియేషన్ కార్యాలయం ఎదుట మంగళవారం న్యాయవాదులు నిరసన తెలిపారు. ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రంగనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, జిల్లా కోశాధికారి పి.దస్తగిరి తదితరులు మాట్లాడుతూ న్యాయవాదులకు వెల్ఫేర్ ఫండ్ రూ.10 లక్షలకు పెంచాలని, ఇళ్లు నిర్మించి న్యాయవాదుల కాలనీ ఏర్పాటు చేయాలని, జూనియర్ న్యాయవాదులకు ప్రతినెలా రూ.5 వేలు స్టైఫండ్ పెండింగ్ లేకుండా ఇవ్వాలని కోరారు. 60 ఏళ్లు దాటిన న్యాయవాదులందరికీ పింఛన్ మంజూరు చేయాలన్నారు. అలాగే న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాలన్నారు.

# డెంగీ, మలేరియాలను అరికడదాం

**కర్నూలు (టౌన్):** డెంగీ, మలేరియా తదితర వ్యాధులను కలిసి కట్టుగా అరికడదామని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. మంగళవారం నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో నగరపాలక ఆరోగ్యశాఖ అధికారులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఏర్పాటు చేసిన డెంగీ నివారణ మాసోత్సవంలో ఆయన మాట్లాడుతూ వర్షాలు ప్రారంభం కావడంతో వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామగిడ్డయ్య, డీఎంఓ నూకరాజు, మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎంటమాలజిస్టు వెంకటేశ్వర్లు, ఏఎస్ఎంలు పాల్గొన్నారు.

– నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ మంగళవారం బళ్లారి చౌరస్తా సమీపంలోని డి–మార్టు వెనుక ఉన్న నిర్మల్ నగర్‌లో నీరు నిల్వ చేసుకునే ట్యాంకులను పరిశీలించారు. మురుగు కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

# గర్భిణుల్లో రక్తహీనతను నివారించాలి

**కర్నూలు(హాస్పిటల్):** గర్భిణుల్లో రక్తహీనతను నివారించేందుకు ఆశా కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ సూచించారు. మంగళవారం ఆయన జొహరాపురంలోని యూపీహెచ్‌సీలో జరుగుతున్న ఆశా సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మాధవి, డెమో డాక్టర్ ప్రమీలాదేవి, పీసీ పీఎన్‌డీటీ మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆశాలకు అవగాహన కల్పిస్తున్న డీఐఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

# మట్టి అక్రమ రవాణాదారులపై చర్యలు

**కర్నూలు (న్యూసిటీ):** మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. మంగళవారం జగన్నాథ గట్టు వద్ద జేసీబీతో మట్టిని తవ్వుతున్నారనే సమాచారంతో జిల్లా విజిలెన్స్ అడిషనల్ డైరెక్టర్ బైరాగి నాయుడు ఆధ్వర్యంలో దాడి చేశామన్నారు. మట్టిని తరలిస్తున్న ఆరు టిప్పర్లను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలిస్తుండగా గిరి అనే వ్యక్తి ఏడీ బైరాగి నాయుడి విధులకు ఆటంకం కలిగించాడన్నారు. టిప్పర్ల యజమానులపై రూ.80 వేలు జరిమానా విధించినట్లు చెప్పారు.



దాడిలో పట్టుపడిన వాహనాలు

## నష్టపరిహారం ఇవ్వాలి

**కర్నూలు(సెంట్రల్):** ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. గత ఖరీఫ్‌లో జిల్లాలో పత్తి, మిరప, ఉల్లి, కంది, ఆముదం, సజ్జ, టమాట, వేరుశనగ పంటలు సాగు చేశారన్నారు. బీమాలో కొన్ని పంటలకు మాత్రమే బీమా వచ్చిందని, మిగతా పంటలకు కూడా బీమాను వర్తింపజేసి రైతులను ఆదుకోవాలని కోరారు. నాయకులు శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, నగేష్, రంగప్పరాజు, దస్తగిరి పాల్గొన్నారు.

# రూ.2 కోట్లతో ఎల్లమ్మ దేవస్థానం పునర్నిర్మాణం

- సినీ నిర్మాత రాజ్‌కుమార్ సేతుపతి

**కర్నూలు (న్యూటౌన్):** వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయాన్ని రూ.2 కోట్లతో పునర్నిర్మాణం చేయనున్నట్లు చెన్నైకు చెందిన సినీ నిర్మాత రాజ్‌కుమార్ సేతుపతి అన్నారు. మంగళవారం ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన అంగీకారపత్రాన్ని దేవస్థానం ఈఓ దినేష్, చైర్మన్ కృష్ణుడుకు అందజేశారు. ఈ సందర్భంగా సినీ నిర్మాత మాట్లాడుతూ గూడూరు మండలం కె. నాగలాపురంలో సుంకులమ్మ ఆలయాన్ని నిర్మించామని చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ సాయి కుమార్, పూజారులు ఎల్లరాజు, పాలక మండలి సభ్యులు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణ అంగీకారపత్రాన్ని ఈఓ, చైర్మన్‌కు అందజేస్తున్న సినీ నిర్మాత రాజ్‌కుమార్ సేతుపతి

# గోదాముల నిర్మాణాలు పూర్తి చేయాలి

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

**కర్నూలు(సెంట్రల్):** బహుళ ప్రయోజన గోదాముల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాలకు అనుసంధానంగా బహుళ ప్రయోజన గోదాముల నిర్మాణాలకు మొదటి విడతలో 95, రెండో విడతలో 10, మూడో విడతలో 40 మంజూరయ్యాయన్నారు. వీటిలో కేవలం 8 మాత్రమే పూర్తి చేశారని, పెండింగ్‌లోని 87 భవనాలను ఆగస్టు 15వ తేదీలోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఇక నుంచి పనుల పురోగతిని రెండురోజులకొకసారి జాయింట్ కలెక్టర్‌కు నివేదికను అందజేయాలన్నారు. రెండో విడతకు సంబంధించి మంజూరైన భవనాలకు త్వరితగతిన ప్రదేశాలను గుర్తించి భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. మూడో విడత గోదాములకు సంబంధించిన భూములను గుర్తించామని నిర్మాణానికి అనువైనవా కాదో తెలపాలని డీసీఓ రామాంజనేయులు కలెక్టర్‌ను కోరగా మార్కెటింగ్ ఇంజినీర్లు వెళ్లి పరిశీలించి వారంలోపు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రైతులు పండించిన పంట ఉత్పత్తులను తూకం వేసుకునేందుకు 95 ఎలక్ట్రానిక్ కాటాలు మంజూరైనట్లు డీసీఓ తెలిపారు. వాటిని వెంటనే సంబంధిత గోదాములకు పంపాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి, జిల్లా హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ జి.సృజన

### తట్టు, రుబెల్లా నివారణకు ఫ్యామిలీ డాక్టర్లు కృషి చేయాలి

తట్టు, రుబెల్లా వ్యాధుల నిరవాణకు కృషి చేయాలని ఫ్యామిలీ డాక్టర్ వైద్యులకు కలెక్టర్ సూచించారు. జిల్లా టాస్క్‌ఫోర్సు కమిటీతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో తట్టు, రుబెల్లా వ్యాధులను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు డిసెంబర్ వరకు రోడ్ మ్యాప్ రూపొందించారన్నారు. ఈ వ్యాధులున్న 9 నెలల నుంచి 12 నెలల్లోపు వయస్సున్న చిన్నారులకు 98 శాతం వ్యాక్సిన్ ఇచ్చారని, 16 నుంచి 24 నెలలోపు వయస్సున్న పిల్లలకు రెండో వ్యాక్సిన్ ఇచ్చారని తెలిపారు. అయితే అర్బన్ ప్రాంతాల్లో పురోగతి చాలా తక్కువగా ఉందన్నారు. కేవలం తట్టు, రుబెల్లానే కాకుండా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, ఏఎన్ఎం ఫీడ్ బ్యాక్ రిపోర్టు అంశంలో కూడా అర్బన్ ప్రాంతాల్లో తక్కువ పురోగతి ఉంటోందని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా వ్యాధుల నిర్మూలనపై ర్యాలీలు, సభలు, సదస్సులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జ్వరం, రాష్‌కు సంబంధించి కర్నూలు జిల్లాలో ఇప్పటి వరకు 62 కేసులు రాగా, ఇందులో 19 కేసుల పాజిటివ్ తట్టుగా నమోదు చేసినట్లు చెప్పారు. అనంతరం ఆమె వైద్య ఆరోగ్య శాఖ కార్యక్రమాలపై సమీక్షించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భవాని, డీసీహెచ్ఎస్ శ్రీనివాసరావు, ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి, ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ రఘు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### పాత నేరస్తుల అరెస్టు

**కర్నూలు:** నాటుసారా విక్రయించి సొమ్ము చేసుకుంటున్న 14 మంది పాత నేరస్తులను ఒకటవ పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కర్నూలు పాతబస్తీలోని వివిధ కాలనీల్లో నివాసముంటున్న షేక్ నిసార్ అహ్మద్, అయూబ్ బాషా, ఎండీ రియాజ్, పఠాన్ షాకీర్ ఖాన్, జగ్గుల రాజేష్ తదితరులను పాతబస్తీ శివారులోని జమ్మిచెట్టు బ్రిడ్జి వద్ద నాటుసారా విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో నిఘా వేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి పది సీసాల నాటుసారా సీజ్ చేసినట్లు ఒకటవ పట్టణ సీఐ నాగశేఖర్ తెలిపారు. అలాగే జొహరాపురానికి చెందిన చాట్ల విశ్వనాథ్, గుంపు శ్రీనివాసులు, జరదొడ్డి ఇజ్రాయెల్, జరదొడ్డి లక్ష్మమ్మ, జి.శ్రీను, మల్లెపోగు నరేష్, చంద్రకంటి లక్ష్మమ్మ, మల్లెపోగు బుజ్జి, గడ్డపోగు మద్దమ్మ తదితరులు జొహరాపురం శివారులోని కేసీ కెనాల్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అదుపులోకి తీసుకుని వారి వద్ద 18 సీసాల నాటుసారాను సీజ్ చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

### మద్యం విక్రేతల అరెస్టు

**కర్నూలు:** తెలంగాణ నుంచి తక్కువ ధరకు మద్యం తెచ్చి కర్నూలులో ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న ఇద్దరిని మూడో పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. బుధవారపేటకు చెందిన జగ్గుల ప్రసాద్, షేక్ అమీన్ బాషా తదితరులు కిసాన్‌ఘాట్ సమీపంలోని హంద్రీ నది ఒడ్డున తెలంగాణ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకుని వారి నుంచి 14 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

### 7న జాబ్ మేళా

**కర్నూలు కల్చరల్:** స్థానిక శ్రీసాయికృష్ణ డిగ్రీ కళాశాలలో ఈనెల 7న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు ఉండి పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, ఎంబీఏ, బీటెక్ చదివిన వారు అర్హులన్నారు. నెలకు రూ.10 వేలు నుంచి రూ.25 వేల వరకు జీతం ఉంటుందని, ఆసక్తి ఉన్న వారు www.apssdc.in లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8309283980, 8374231357 సంప్రదించాలని సూచించారు.

### 7న బోనాల పండుగ

**కర్నూలు కల్చరల్:** ఓల్డ్‌సిటీ బండిమెట్టలోని గంగా భవానీ సహిత కేదారేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 7న ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారిని శాకాంబరిగా అలంకరించి దర్శనకం కల్పించనున్నట్లు చెప్పారు. సామూహిక కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. ఉదయం 11 గంటలకు బండ మెట్ట ఆలయం నుంచి మించిన్ బజార్‌లోని పెద్ద ఎల్లమ్మ, చిన్న ఎల్లమ్మ ఆలయాల వరకు 108 బోనాలతో ఊరేగింపు ఉంటుందన్నారు.

## అవి-ఇవి

### 8న డిగ్రీ కళాశాల రగ్బీ పోటీలు

**కర్నూలు(రూరల్):** నగరంలో బి.క్యాంప్ క్రీడా మైదానంలో ఈనెల 8న ఉమ్మడి కర్నూలు జిల్లా డిగ్రీ కళాశాలల రగ్బీ పోటీలు నిర్వహించనున్నట్లు రగ్బీ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ.50 రుసుం చెల్లించి పోటీలలో పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాలకు 9393827585ను సంప్రదించాలన్నారు.

### సాగునీటి ప్రాజెక్టులను నిర్మించాలి

**కర్నూలు (రూరల్):** జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా జీవనాడి అయిన వేదవతిని పూర్తి చేయాలన్నారు. హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి జిల్లాలోని చెరువులను నీటితో నింపాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, రామకృష్ణ, నారాయణ పాల్గొన్నారు.

### నేడు డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ

**కర్నూలు(రాజ్‌విహార్):** విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వినియోగదారులు బుధవారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య 7382614308 నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలు చెప్పుకొని పరిష్కారం పొందాలన్నారు.

### పెంపుడు కుక్కలకు రేపు యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌లు

**కర్నూలు(అగ్రికల్చర్):** ఈనెల 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండారెడ్డి బురుజు సమీపంలోని బహుళార్థ పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌లు వేయనున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ హేమంత్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు విధిగా రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని యజమానులను కోరారు.

### పట్టాలు ఇవ్వాలి

**కర్నూలు(సెంట్రల్):** పేదలు సాగు చేసుకుంటున్న భూములు, నివాసం ఉంటున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆర్‌డీఓ హరిప్రసాదును కలిసి వినతిపత్రం సమర్పించారు. కర్నూలు మండలం గొందిపర్లలో గుడిసెలలో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు.

### లాయర్‌పై చర్యలు తీసుకోండి

**కర్నూలు(అగ్రికల్చర్):** కొతాళం మండల వ్యవసాయ అధికారి శేషాద్రిపై దాడికి పాల్పడిన ఆదోనికి చెందిన లాయర్ శ్రీనివాస కళ్యాణరెడ్డిని కఠినంగా శిక్షించాలని వ్యవసాయ అధికారుల సంఘం జిల్లా నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం వారు దాడిని ఖండించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరిరెడ్డి, నేతలు రవిప్రకాశ్, శ్రీవర్ధన్‌రెడ్డి, వరప్రసాద్, సురేష్ తదితరులు మాట్లాడుతూ పార్కింగ్ చేసి ఉన్న లాయర్ కారుకు ఏఓ కారు స్వల్పంగా రాసుకుందన్నారు. కారు పెద్దగా డ్యామేజీ కాకపోయినా, విధులకు వెళ్తున్నానని ఏఓ చెబుతున్నా వినకుండా లాయర్ దౌర్జన్యంగా ఇంట్లోకి లాక్కెళ్లి దాడి చేశారన్నారు. లాయర్ బార్ కౌన్సిల్ సభ్యత్వాన్ని రద్దు చేసి, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### రేపు నిరుద్యోగ సమస్యలపై ధర్నా

**కర్నూలు(రూరల్):** జిల్లాలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 6న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి తెలిపారు. మంగళవారం సీఆర్ భవనంలో ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. సమావేశంలో నగర నాయకులు బాబయ్య, బీసన్న, కృష్ణ, రామచంద్రుడు, చంటి పాల్గొన్నారు.

### పదోన్నతులు కల్పించండి

**కర్నూలు (సెంట్రల్):** అర్హులైన గ్రామ రెవెన్యూ అధికారులకు సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పించాలని ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా కమిటీ ప్రతినిధులు మంగళవారం జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, జిల్లా రెవెన్యూ అధికారి నాగేశ్వరరావులకు వినతి పత్రం సమర్పించారు.

## నిధులు సద్వినియోగం చేసుకోవాలి

**కర్నూలు(హాస్పిటల్):** జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) నిధులను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య సూచించారు. ఎన్‌ఎంహెచ్ ద్వారా మంజూరైన బడ్జెట్ వినియోగంపై యూపీహెచ్‌సీ వైద్యాధికారులకు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. అనంతరం ఆయన స్టాంటన్‌పురం, ఇల్లూరు నగర్ యూపీహెచ్‌సీలను సందర్శించి రికార్డులు, రిపోర్టులు పరిశీలించి సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ పీఓ హేమలత, డీపీఎంఓ డాక్టర్ ఉమా, ఏఓ శర్మ, డీపీఓ విజయరాజు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ కోతలు

**కర్నూలు(రాజ్‌విహార్):** టిడ్కో సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ పనులు జరుగుతున్న కారణంగా బుధవారం బి.తాండ్రపాడు పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ డీఈఈ వైసుబ్బన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కోతలు విధిస్తున్నట్లు పేర్కొన్నారు.